# అభిముఖం

ఆలాపన మంత్లీ- మార్చి, 2003



ఆయనకు ఫోన్ చేయకూడదని అనుకుంటూనే ఉన్నాను.

కానీ, అంతరంగం నన్ను డామినేట్ చేయడంతో- నా చేతులు నా ప్రమేయం లేకుండానే నెంబర్స్ డయల్ చేయడం మొదలుపెట్టాయి.

నాలో ఏదో సంకోచం... భయం!

ఆయన రెస్పాన్స్ ఎలా ఉంటుందో..? సమాధానం తీరువుగా ఉంటుందో- లేక తీసి పడేస్తాడో..?! సున్నితమైన ఆ క్షణకాలంలోనే ఆయన రచనని మరొక్కసారి మననం చేసుకున్నా. అసలే బహుమతి పొందిన కథ... ఈ పామరుడికి అస్సలు అర్థంకావడం లేదు.

అర్థంకాని భాషకే ఆదరణ ఎక్కువ అనిపించింది నాకు! అతని స్వపరిచయంలో చదివాను... తాను ఒక బ్రహ్మచారి అని.., పద్యము, మద్యము ప్రీతి అని!

ఎంత రైటరయినా ఇంత తెగింపా..? 'పెద్దవారు కదా!' అని మనసు సర్దిచెప్పింది.

ఆవలినుండి పలికింది ఆడగొంతు కావడంతో- ఆలోచనలో పడ్డాను... 'బ్రహ్మచారి ఇంట?!'

'ఏమో... ఆయన పరిచయ భాగ్యం తప్ప- గొప్పవారి గోత్రాలు నాకెందుకులే!' అన్పించింది.

"నరహరిగారు కావాలి మేడమ్!"

"మీరు..?"

"ఐయామ్ మణికంఠ ఫ్రమ్ మామిడి కుదురు!"

"ఇప్పుడు లేవరు... ఆయన మంచినిద్రలో ఉన్నారిప్పుడు!" ఫోన్ పెట్టేసింది ఆవిడ.

'ఉదయం పదిగంటల వేళ నిద్ర..? అవును! మధువు మత్తులో మునిగిన మనిషికి మాట ఎట్లా వస్తుంది?' ...అనుకున్నాను కసిగా.

అయినా నా ప్రయత్నం ఆగలేదు.

"హలో... ఇప్పుడప్పుడే లేవరు! లేచినా మాట్లాడరు..!"

"అదేంటి..?"

"హలో... నేను నరహరిని... చెప్పండి!" తన గొంతు వినబడింది ఆవలినుండి.

"సార్! ఐయామ్ మణికంఠ... మీ అభిమానిని!"

"దట్స్ గుడ్!"

"నేనూ కథలు వ్రాస్తుంటాను సార్... ఇప్పుడిప్పుడే ఒకటి రెండు కథలు ప్రచురింపబడ్డాయి!"

"ఆ చిన్నపత్రికల్ని చదవడం మానేసి నేను చాలా కాలమయింది."

"అదేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆ చిన్నపత్రికలు నా స్థాయికి సరిపడవు."

"మీ ప్రవృత్తిని అభిమానించే నేను- మీ వృత్తి తెలుసుకోవచ్చా?" అన్నాను.

ఆవలివైపు నుండి బిగ్గరగా, సుదీర్ఘమైన నవ్వు విన్పించింది.

మతి పోగొట్టుకోవడం నా వంతయింది. అయినా... ఆయన నాకు ప్రేరణ! నా కథలకు కథానికలకు స్ఫూర్తి!

'బండరాళ్ల మధ్య నాగరికతల వాసనల్లేని ఓ నగ్నశిశువు ప్రభవించబోతోందన్న సత్యం జీర్ణంకావడం లేదు. బేసిక్ మిడ్‌వైఫరీ గురించి నేర్పిన సూత్రాలు గుర్తురావడం లేదు. అనుభవ రాహిత్యం... ఆమెను మెల్లగా లేపి పెద్దబండ చాటుకు తీసుకెళ్లా. నాకిప్పుడు తెలుసు... నేను డెలివరీ చేయాలి. నేను తప్ప ఆ అమ్మాయి కెవ్వరూ లేరు...' ఆయన కలం నుండి జాలువారిన సిరా మరకలు నన్ను మంత్రముగ్ధుణ్ణి చేస్తున్నాయి.

క్రమంగా అతని అహంకారపు క్రీనీడ ముందు నాలోని సున్నితత్వపు తాలూకు వెండివెన్నెల ఛిద్రమైపోతోంది.

రచయితగా ఎంత పేరు సంపాదించినా- ఎదుటివారి ముందు ఇంత అవహేళనా? ఫోన్ పెట్టేద్దా మనిపించింది. కానీ, నాలోని మంచితనం వారించింది నన్ను.

"ఈమధ్య ఏం రాశారు సార్..?" అన్యమనస్కంగానే అడిగాను.

ఏవేవో చెప్పాడు.

"నా కథలు చదివి మీ ఓపీనియన్ ఇవ్వండి సార్!" అభిమానాన్ని మరోసారి మనసులో నింపుకొని అడిగాను.

"చూద్దాం..! కానీ, రైటింగ్ హాబిట్ చాలా కష్టమైన ప్రవృత్తి. మీరు దానిలో రాణించాలంటే నాలాగ చాలా కష్టపడాలి!"

"సార్! మిమ్మల్ని చూడాలని ఉంది!"

"ఎందుకో..?!"

"మీ రచనలు నాకు ఆదర్శం! అటువంటి అక్షరఖండాల్ని సృష్టించిన భావశిల్పిని చూడాలనుకోవడంలో తప్పు లేదనుకుంటా!"

"కొంతవరకు కరెక్టు అయిఉండొచ్చు. అయితే చిన్నచిన్న అభిమానాల్ని ప్రోగుచేసుకొని నా టైమ్‌ని వేస్ట్ చేసుకోదల్చుకోలేదు. కాబట్టి చేస్తున్న పనిలో రాణింపు సాధిస్తే అప్పుడు చూస్తా!"

"అయితే... ఉంటా సార్!"

"బై..!"

ఫోన్ పెట్టేసిన తరువాత తెలియని నీరసం ఆవహించింది నాలో! ఒకస్థాయి కెదిగిన వారిలో అహం సాధారణమేమో?! ఆ క్షణంలో 'అతనిది ఏమంత సాహిత్యంలే?' అన్పించింది.

ఉన్నతంగా ఊహించుకున్న వ్యక్తి- ఉదాసీనత ప్రదర్శించేసరికి మనసు కకావికలమైంది నాకు. నిర్మించుకున్న స్ఫూర్తిసౌధం కూలిపోయినట్లనిపించింది. నెమ్మదిగా ఆ ఇటుకల్ని తప్పించుకొని బయటపడ్డాను. పడ్డవాడు ఎప్పుడూ చెడ్డవాడు కాదనిపించి నన్ను నేను సమాధాన పరచుకున్నాను. ఎలాగైనా నన్ను నేను గెలవాలన్న ఆలోచన నాకు కొండంత అండ అయింది.... ఆ క్షణం నా మనసును సముదాయించింది. నన్ను నేను ప్రేరేపించుకున్నాను.

నరహరి గుర్తుకు వచ్చేసరికి శరీరం కంపించిపోతుంటుంది. ఆయన 'హెడ్‌స్ట్రాంగ్‌నెస్'కి సరి అయిన సమయంలో సరి అయిన రీతిగా సమాధానం చెప్పాలనిపిస్తోంది.

'కలం కన్నును ఎర్రజేసి భావకుసుమాలను పూయింపజేయాలి. మెడలోపడ్డ బరువైన ఆ గులాబీల హారంతో అతని తల వంగిపోవాలి...' అన్న తలపు నాకు ఎంతో శక్తి నిచ్చింది.

'నరహరీ... చూడు! వీడు మణికంఠా... మజాకా!' అనుకున్నాను నాలోనే.

ఇక నా కలం ఆగిపోలేదు.

అయినా- వండిన ప్రతిపదార్థాన్నీ ఆయనకు ఫోన్‌లో కసిగా వినిపించి, తినిపిస్తూనే ఉండేవాణ్ణి! కానీ, ఆయనలోని కృత్రిమ భావన నన్ను ఎప్పుడూ అవహేళన చేసేది.

అవమానంతో క్రిందపడ్డ ప్రతిసారీ పడిలేచిన కెరటమైపోయేవాణ్ణి! అది ఉత్తుంగ తరంగమై దూసుకుపోతూంటే, నా ఆలాపనను నరహరికి చెవులు చిల్లులు పడేలా వినిపించి వినిపించి సేదదీరేవాణ్ణి. ఈ నిరంతర ప్రక్రియలో నాకు, నా రచనలకు ఎన్నో అవార్డులు, ఎన్నో పురస్కారాలు లభించాయి. వెళ్లిన ప్రతిచోట ఎంతో ఆనందాన్నిచ్చింది.

నరహరికి సంతోషంగా ఫోన్ చేసి చెప్పాను. అప్పుడూ చిన్నచూపే! ఎగతాళి మాటలే!

'ఈ మనిషి ఇంతే..!' అనుకొని మిన్నకుండిపోయాను.

● ● ●

'కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు అందుకోబోతున్న ఆరోజు- నాలో అంతులేని ఆనందం నెలకొంది.

కానీ, ఆ సభకు ముఖ్య అతిథి నరహరి! పైగా... ఆయన ఈ పురస్కార ప్రక్రియలో ఒక న్యాయనిర్ణేత అట! అక్కడ ఫంక్షన్‌లో నన్ను చూసి ఆయన నవ్విన చిరునవ్వుకి నా ఒంటి మీద తేళ్ళు పాకినట్లయింది. అయినా 'నన్ను గాయపరచిన నరహరి చేతుల మీదుగా అందుకుంటున్న పురస్కారం అది. అతనిపై నా గెలుపు!' అనిపించింది.

అవార్డు బహూకరించిన తరువాత అధ్యక్షోపన్యాసం చేస్తూ నరహరి-

"ఈ యువరచయితలో విషయాన్ని విపులంగా ఆవిష్కరించగల శిల్పముంది. కథనాన్ని చక్కగా నడిపించగల ధారణశక్తి ఉంది. అటువంటి మణికంఠకు ప్రీతిపాత్రుణ్ణి కావడం నేను అదృష్టంగా భావిస్తున్నాను. ఏ వృత్తిలో అయినా ఎక్కడైతే ఫ్రిక్షన్ ఉందో... ఎక్కడ పట్టుదల పెరుగుతుందో... అక్కడ ఉదాసీనత నెలకొంటుంది.

ఉదాసీనత అనేది మనిషి మనుగడకు ప్రథమ అడ్డంకి! తనను తాను కాంప్రమైజ్ చేసుకున్నప్పుడు అభివృద్ధి మార్గాలు మూసుకుపోతాయి, అభ్యంతరాలు అడ్డుగోడ లవుతాయి. కానీ, అభ్యంతరాలు ఉన్నచోటే ఆనందం ఉంటుంది. అంతా బహిర్గతం అయిపోతే ఏమీ ఉండదు.

అందుకే నా ఈ శిష్యుణ్ణి అవహేళన చేసేవాణ్ణి, రెచ్చగొట్టేవాణ్ణి! నాకు కావల్సింది- అతనిలోని వేదన! తద్వారా అతని అభివృద్ధి!! నా మాటల తూటాలతో అతనిలోని ఆరాటాన్ని ఆవిష్కరించగలిగాను.

ఇవన్నీ సహజాతి సహజమైన చిత్రమైన భావావేశాలు. మనం ఎదుటిమనిషిలోని గొప్పగుణాన్ని పొగుడుతూ పోతే- అది చివరికి విసుగుదలగా రూపాంతరం చెందుతుంది. దానిని అధిగమించాలంటే అవగాహన కావాలి, మన్నింపు ధోరణి అవసరం. అదే మానసిక పరిపక్వత!

నా చేష్టల ద్వారా మణికంఠ అటువంటి పరిపక్వత సాధించాడు. తద్వారా అపురూపమైన ఈ పురస్కారాన్ని పొందాడు. ఈ యువతేజాన్ని మనసారా అభినందిస్తున్నాను. అతని భవిష్యత్తు బంగారుమయం కాగలదని నమ్ముతున్నాను."

నరహరి ఉపన్యాసానికి తప్పట్లు మిన్నుముట్టాయి. ఒక్కసారి దిమ్మతిరిగిపోయినట్లుంది నాకు. నెమ్మదిగా నరహరి పట్ల నాలో నెలకొన్న విచక్షణా రహితమైన ఊహ- నా ఊపిరిని హరించినట్లయింది. మనసు నిండా ఆత్మన్యూనతా భావం నెలకొంది. 'గొప్పవారి మాటలకు అర్థాలు వేరు' అంటే ఇదేనేమో!

బ్రహ్మచారి నరహరిగారింట్లోని ఆ ఆడగొంతు ఆయన సోదరిది ఎందుకు కాకూడదూ?! నన్ను నేను చెడామడా తిట్టుకున్నాను... నా సంకుచితత్వానికి!

'సార్! నన్ను క్షమిస్తారు కదూ! పూలు, ముళ్ళు చేతబట్టుకొని చరిత్ర పుటల్లో ఇరుక్కుపోతూన్న జనారణ్యంలో మానవతాసుగంధం మీరు. ఆ సువాసనలతో వాసనలేని చిగుళ్ళు కూడా పరిమళిస్తాయి. హేట్సాఫ్!'

నేను పైకి అనలేకపోయినా- నా హృదయ విలాపం నన్ను కొంతవరకు సేదదీర్చగలిగింది.